
సీతాపతి ఆఫీస్ నుంచి ఇంటికి వచ్చేసరికి రాత్రి ఏడైంది. ఇంటికి తాళం వేసి ఉంది. తన భార్య సీత, పిల్లలు తనకు చెప్పకుండా ఎక్కడికి వెళ్ళి ఉంటారబ్బా...! అని ఆలోచిస్తుండగా పక్కింటి పరాంకుశం భార్య వచ్చి తాళాలు చేతిలో పెట్టి, మారు మాట్లాడకుండా వెళ్ళిపోయింది. తాళం తీసి లోనికి వెళ్ళి లైట్లు వేసాడు. గదులన్నీ తిరిగాడు. ఇల్లంతా బోసి పోయినట్లనిపించింది. సీత ఉన్నట్లయితే ఈ పాటికే మాంచి కాఫీ ఇచ్చును. కాఫీ తాగాలని ఉంది సీతాపతికి కాని, చేసు కొనే ఓపిక లేక ఎప్పటిలాగే డ్రస్ మార్చుకోకుండా బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి, టీ.వి. ఆన్‌చేసి బెడ్ ఎక్కి కూర్చున్నాడు.



# శ్రీమతి డైరీ

## అభిమన్యు



సీతాపతి, సీతకి పది సంవత్సరాల క్రితమే పెళ్లి జరిగింది. వారి అన్యోన్య దాంపత్యానికి గుర్తుగా ఇద్దరు పిల్లలు కలిగారు. ఐదేళ్ల బాబు రవీంద్ర... మూడేళ్ల పాప సింధూర. చాలా చాలామంది దంపతుల్లాగే వీరు కూడా ఎటువంటి కలహాలు, విరహాలు లేకుండానే ఇంతవరకూ కాపురం వెలగబెట్టారు. పిల్లలు పుట్టాక, ఒకరంటే ఒకరికి మోజు తగ్గాక చిన్నచిన్న లోపాలను బూతద్దంలో చూసుకుంటున్నారు... గొడవలు పడుతున్నారు.

టీ.వి. చూస్తున్నాడన్న మాటే గాని సీతాపతి సీత గురించి ఆలోచిస్తున్నాడు. ఉదయం జరిగిన గొడవ గుర్తుకి వచ్చింది.

సీత ఎప్పటిలాగే పిల్లల్ని తయారు చేస్తోంది కాన్వెంట్‌కి పంపించడానికి. బెడ్‌రూమ్‌లో బెడ్ మీద కూర్చుని టీ.వి. చూస్తూ "సీతా" అని పిలిచాడు సీతాపతి. సీత వినిపించుకోలేదు. రెండోసారి పిలిచాడు. ఈ అరుపులు, పిలుపులు కామన్ అని ఊరుకుంది. మూడోసారి బిగ్గరగా అరిచేసరికి ... చేస్తున్న పనిని ఆపి, పైటచెంగును నడుం మడతల్లో దోపి, రుసరుసమని గదిలోకి వెళ్ళి "ఎందు కలా అరుస్తారు...? మీకు లాగ ఖాళీగా కూర్చోలేదు. మీకు, మీ పిల్లలకి వండి వార్చుతున్నాను" అంది.

"భలే బిల్డప్ ఇస్తావే.. అంతా ఆఫ్‌బాయిల్డే గదా... ఒక రుచా పచా... నీ చేతివంట తినే కదా ఇలా అయిపోయాను... పెళ్లికి ముందు ఎలా ఉండే వాణ్ని... నూటొక్క జిల్లాల అందగాడ్ని..." సీత వైపు వంకరగా చూస్తూ అన్నాడు సీతాపతి.

"ఒక్కసారి ఫేస్ అద్దంలో టర్న్ ఇచ్చేకోండి... పెళ్లికి ముందు 'రాజబాబు'లా ఉండే వారు. ఇప్పుడు 'బ్రహ్మానందం'లా తయారయ్యారు. నమ్మకపోతే పెళ్లి నాటి ఫోటోలు, క్యాసెట్ చూసు కోండి" అంది సీత.

"నీకు ఈ మధ్య బాగా పెరిగింది.... సరిసరి ముందు తలకి నూనె రాయి..." అన్నాడు సీతాపతి పళ్ళు నూరుతూ.

"ఏముంది అక్కడ పట్టుమని పాతిక వెంట్రుకల్లేవ్... హృతిక్ రోషన్‌లా జుట్టు మొలిపించు కోండని వందసార్లు చెప్పాను.. విన్నారా...!?"

"నువ్వేమైనా ఐశ్వర్యారాయి ననుకుంటున్నావా...!? హృతిక్ హృతిక్ అని తెగ కలవరిం చేస్తున్నావ్...."

"మీ ఫేస్‌కి అంతసీన్ లేదు... నేనే ఎక్కువ..." గర్వంగా అంది సీత.

"అవునవును అన్నీ ఎక్కువే... గుండు రాయికేం తెలుసు సొగసు, శృంగారం..." అన్నాడు సీతాపతి.

"అవును మరి ఈ గుండురాయిని పెళ్లిచూపుల్లో చూసి వందమందితో అడిగించారు. మరిచి పోయారేమో...!?" అంది సీత.

"నీకీ మధ్య కొవ్వు బాగా పెరిగింది. మొగుడు అంటే గౌరవం, భయం లేకుండా పోయింది. నాకు గాని తిక్కరేగిందంటే విడాకులిచ్చేస్తాను... జాగ్రత్త..." అని బెదిరించాడు సీతాపతి.

"ఏం...? మీ ఆఫీసులో స్టెనోకి లైనేస్తున్నారా...!?" సీతాపతి వైపు ఓరగా చూస్తూ అంది సీత.


ఆ మాటలకి సీతాపతి కోపం తెచ్చుకొని "నిన్ను ... నిన్ను..." అని సీత మెడపట్టి తోసాడు. ఆ తోపుడుకి సీత వెనక్కి పడిపోవలసిందే.... కాని బ్యాలెన్స్‌గా కాచుకుంది.

"ఈ మనిషి ఎప్పుడూ ఇంతే..." అని చిరాకుపడి గది బయటికి వచ్చేసింది సీత.

గడియారం వైపు చూసాడు సీతాపతి. ఎనిమిది అయ్యింది. క్రమం తప్పకుండా చూసే టీ.వి సీరియల్స్ మీద మనసు లేదు. తల నొప్పిగా ఉంది. సీత, పిల్లలు ఎక్కడికి వెళ్ళారో తెలియడం లేదు. తనకు తెలియకుండా, చెప్పకుండా సీత ఎక్కడికీ వెళ్ళదు. కాఫీ తాగాలని ఉంది. టీ.వీ. కట్టేసి, వంట గదికి వెళ్ళాడు సీతాపతి.

స్టవ్ మీద పాలగిన్నె పెట్టి కాఫీ పొడరు కోసం వెతుకుతున్న సీతాపతికి పప్పులు, పోపుల డబ్బాల వెనుక డైరీ కనిపించింది. అదితీసి చూసి ఆశ్చర్యపోయాడు సీతాపతి. కాఫీ విషయం మరిచిపోయి ఆ డైరీని చదవడం ప్రారంభించారు.

అది శ్రద్ధగా ప్రతి దినం రాసుకునే డైరీ కాదు. అది కేవలం సీత ఫీలింగ్స్. అందులోని అక్షరాలు చదువుతుంటే సీత మీదున్న హేళన భావం పోయి గౌరవభావం కలుగుతోంది సీతాపతికి.



''దేవుడు నిజంగా మగ పక్షపాతియే.... స్త్రీని అందంగా సృష్టించాడు. సంసారం అనే పంజరంలో బంధించాడు.

''స్త్రీకైనా పురుషుడికైనా జీవితంలో తోడు అవసరం. అందుకే పెళ్లి. నిజానికి ఈ పెళ్లి నాకిష్టం లేదు. తల్లిదండ్రుల మాటను తీసేయ లేక...''

''అయిష్టాన్ని ఇష్టంగా మార్చుకొని... నా ఫీలింగ్స్‌ని నాలోనే దాచేసుకొని కాపురానికి వచ్చాను...''

''పిల్లలు పుట్టనంతవరకూ నా. కాపురం సజావుగా, ఆనందంగా సాగింది. ఎంత ఆనందం అంటే... 'మా ఆయన బంగారం' అనే ఫీలింగ్ కలిగింది. బహుశా! చాలామంది అమ్మాయిలకి పెళ్లైన కొత్తలో ఇలాంటి ఫీలింగ్స్ ఉంటాయనుకుంటాను. హేట్సాఫ్ టు హజ్‌బండ్...''

''భరించే వాడు భర్త అంటారు... అది పొరపాటు. ఆఫీస్‌లో బాస్ తిట్టినా, స్నేహితులతో గొడవ పెట్టుకున్నా, ఎవ్వడితోనన్నా తన్నులు తిన్నా సరాసరి ఇంటికివచ్చి పెళ్లాం మీద చూపిస్తారు పౌరుషం...''

''మా ఆయన పేరులోనే నేను సగం. అంతేగానీ ఏనాడు నా పనులకి సాయం రాలేదు. ఈ మగాళ్ళు ఆఫీసుల కెళ్ళి ఏం వెలగబెడ్తారో తెలియదు గానీ... ఇంటి దగ్గర మాత్రం పెద్ద బిల్డప్ ఇస్తారు. ఫ్యాన్ క్రింద కుషన్ ఛైర్‌లో కూర్చొని పనిచేసే వాళ్ళు ఇలా ఫీలైపోతుంటే... రిక్షా తొక్కే వాళ్ళు, రాళ్ళు కొట్టే వాళ్ళు ఇంకెంత ఫీల వ్వాలి...!?''

''నా పతి ఆఫీసు నుంచి వచ్చిన వెంటనే టీవికి అతుక్కుపోతారు. పిల్లలు ఏం చదువుతున్నారు..? ఎలా చదువుతున్నారు...? లాంటివి ఆయనకి పట్టవు. రాత్రి పది వరకు టీవీ చూస్తారు. అన్ని సీరియల్స్ ఫాలో అవుతారు. పడుకునే ముందు కోరిక కలిగితే అప్పుడు పెళ్లాం గుర్తుకు వస్తోంది...''

''ఇంట్లో ఎప్పుడూ సీరియస్‌గానే ఉంటారు. భార్యతో పది నిమిషాలు సరదాగా మాట్లాడటానికి కూడా టైం లేనంత బిజీ మనిషి. స్నేహితులతో ఎన్ని గంటలైనా సరదాగా జోకులేస్తూ, నవ్విస్తూ, నవ్వుతూ ఉంటారు ఏంటో మరి...!?''

''నిజానికి నాకు సరిగ్గా వంట చేయడం రాదు. అయినా బాగా చేయడానికి ప్రయత్నిస్తుంటాను. తరచూ వంట బాగాలేదని కోపంతో చిందులు వేస్తారు. బాగున్న రోజున మాత్రం 'బాగుంది'' అనరు.

''నీకీ చీర బాగుంది... నువ్వు చాలా అందంగా ఉంటావ్... నువ్వంటే ఇష్టం..'' లాంటి మాటలు పెళ్లైన మొదట్లో విన్నాను. ఇప్పుడు తరచూ ఆయన నోటి నుండి వచ్చే పదం 'నువ్వొక వేస్టాఫ్ ఇండియా''

''నా పుట్టింటి తరపువాళ్ళు గాని, నా స్నేహితులు గాని ఎవరైనా వస్తే మూతి ముడుచుకొని కూర్చుంటారు. అదే తన వాళ్ళెవరైనా వస్తే నేను మాత్రం పళ్ళికిలిస్తూ మాట్లాడాలి...''

''నన్ను గాని, పిల్లల్ని గాని సరదాగా సినిమాలకి గాని, షికార్లకి గాని తీసుకువెళ్ళరు. ఆయన మాత్రం కొత్తగా రిలీజైన సినిమాలన్నీ చూసేస్తారు. మొత్తానికి భార్య అంటే ఆయన దృష్టిలో జీతం, భత్యం లేని, కాదు... కాదు అడగని సేవకురాలు...''

''ఇరవైఏళ్ల అమ్మా నాన్న దగ్గర పెరిగి ఒకే ఒక్క రోజులో ఇంకో ఇంటికి కాపురానికి వెళ్ళాల్సి వస్తుంది. ఇంట్లో ఉన్న అమ్మానాన్నతో, తోబుట్టువులతో అత్త మామలను, బావ మరదళ్లను పోల్చు కోవలసి వస్తుంది. పుట్టింట్లో ఉన్నప్పుడు అమ్మ బెడ్‌రూమ్‌కి కాఫీ తెచ్చిచ్చేది. ఆకలిగా లేదంటే అమ్మ బతిమిలాడి గోరు ముద్దలు తినిపించేది. ఇప్పుడు అందరూ తిన్నాక ఆఖర్న తను తినాలి ఏమైనా మిగిలితే. భార్య ఒక్క రోజులో మారినంత, భర్త మారలేడా..? పుట్టింట్లో అల్లారు ముద్దుగా పెరిగిన భార్యను మెట్టినింట్లో సంతోషంగా ఉంచడానికి భర్త ప్రయత్నించక్కర లేదా...!?''

ఆ డైరీ చదివాక సీతాపతి మనస్సంతా ఏదోలా అయిపోయింది. తన జీవిత భాగస్వామి పట్ల ప్రవర్తించిన తీరుకు సిగ్గుపడుతున్నాడు. డైరీని యథాస్థానంలో ఉంచాడు. ఈలోగా తలుపు చప్పుడైంది.

సీతాపతి తలుపు తీసాడు. సీత, పిల్లలు, పిల్లల చేతుల్లో బెలూన్లు, బొమ్మలు. సీత ముఖంలో భయం.

''మీ సెల్‌కి నాలుగుసార్లు చేసాను. ఎంగేజ్ వచ్చింది. ఎగ్జిబిషన్ ఈ రోజుతో ఆఖరు. పిల్లలు గొడవ పెడ్తుంటే...'' అని సీత సీతాపతి వైపు చూసింది.

సీతాపతి ముఖంలో ఎటువంటి ఫీలింగ్స్ లేవు. ''నాకు తల నెప్పిగా ఉంది కాఫీ కావాలి...'' అని అడిగాడు.

''రెండు నిమిషాల్లో తెస్తాను. మీరెళ్లి టీవీ చూస్తుండండి..'' అని వంట గదిలోకి నడిచింది సీత.

''నేను టీ.వి చూడను..'' అన్నాడు సీతాపతి. సీత, పిల్లలు ఆశ్చర్యంగా చూసారు సీతాపతి వైపు.

''అదేం పాపం... సీరియల్స్ మిస్సయితే మీకు నిద్ర పట్టదు...'' వ్యంగ్యంగా అంది సీత.

''ఇప్పటికే చాలా మిస్సయ్యాను..'' అని వంట గది లోకి వెళ్ళి సీత నడుం మీద చేతులేసి చిన్నగా నొక్కాడు.

''ఏంటి విషయం...!?''

''ఈ చీరలో నువ్వు చాలా అందంగా ఉన్నావు...''

''ఈ డైలాగ్ పెళ్ళైన మొదటి రోజుల్లో విన్నట్టు గుర్తు...''

''రోజూ చెబితే బాగుండదనా..''

''ఆఁ!''

''అవును మరీ.... నా అపరంజి బొమ్మకి దిష్టి తగులుతుందని...''

''దొంగ మాటలే కాదు. దొంగ బుద్ధులు కూడా ఉన్నాయి...''

''నేనేం చేసాను..!''

''నా డైరీ చదివారుగా....'' కళ్ళను గుండ్రంగా తిప్పుతూ అంది.

''అవును సీతా! 'మగాడు' అన్న అహంతో నీ పట్ల దురుసుగా ప్రవర్తించాను. నీ ఫీలింగ్స్ చదివి 'భార్య', అంటే 'బానిస' అనే భావం నుండి బయటికి వచ్చాను. నిజానికి స్త్రీ లేనిదే పురుషుడు లేడు. స్త్రీ సహాయ సహకారాలు లేకుంటే పురుషుడు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేడు. ఇది నిజం...'' అని సీతాపతి సీత గుండెల్లో తలదాచుకున్నాడు.

''సంసారంలో గిల్లికజ్జాలు, చిన్ని చిన్ని మనస్పర్థలు సహజం. భార్యాభర్తల మధ్య కోపాలుండాలి. గొడవలుండాలి, మళ్ళీ సర్దుకుపోవాలి, మరలా మరలా ప్రేమించుకోవాలి..'' అంది సీత.

తెలివిగా మాట్లాడుతున్న భార్యను ఆనందంతో కౌగిలించుకున్నాడు సీతాపతి. స్టవ్ మీద కాఫీ పొంగింది. పిల్లలు మమ్మీ, డాడీ అంటూ వచ్చారు.

★